అకాల వర్షంతో రైతుల ఆందోళన



విశాలాంధ్ర - సీతానగరం : అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 21 పంచాయితీల పరిధిలో రైతులు 8086 ఎకరాల్లో దాళ్వా సాగుచేశారు. నేటికీ సుమారు 50శాతం పంట కోతకు సిద్ధంగా ఉంది. బుధవారం సాయంత్రం ఒకసారిగా అకాల వర్షం కురవడంతో ఒక్క సారిగా రైతులు ఆందోళన చెందారు. ఇలాగే సర్వా పంటలో రైతులకు పంట చేతి కొచ్చే సమయానికి వర్షాలు కురవడంతో చాలా మంది రైతులు అపార నష్టం చూడల్సి వచ్చింది. దీనితో దాళ్వా పంట కూడా చేతికొచ్చే సమయానికి వర్షం కురవ దంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటితో ఈ వర్షాలు ఆగితే రైతులు ఆర్థికంగా కోలుకునే అవకాశం ఉందని లేవపోతే రైతులకు కోలుకోలేని విధంగా ఆర్థికంగా పెద్ద ఎదురు దెబ్బ తగులుతుందని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా రైతులను ఆదుకునే విధంగా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రైజింగ్ హాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో

చిన్నారి బోన్‌మారో ఆపరేషన్‌కు ఆర్థికసాయం

విశాలాంధ్ర - అనపర్తి : రాజమహేంద్రవరం రైజింగ్ హాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హుకుంపేట రామ కృష్ణ నగర్‌కు చెందిన పాప బోన్‌మారో ఆపరేషన్‌కు రూ.66వేలు ఆర్థికసాయం అందచేసినట్టు సంస్థ వ్యవస్థాపకులు నల్లమిల్లి ఆది రెడ్డి బుధవారం తెలిపారు. అనపర్తిలో ఆదిరెడ్డి మాట్లాడుతూ కళ్యాణి, కుమార్ స్వామి దంపతుల కుమార్తె ప్రత్యక్ష వర్ధిని బోన్ మారో ఆపరేషన్‌కు ఎంపీ భరత్‌రామ్ ప్రభుత్వం ద్వారా రూ.14 లక్షలు మంజూరు చేయించారని మెరుగైన వైద్య నిమిత్తం కోసం మరో రూ.8.5 లక్షలు అవసరం కాగా సంస్థ సభ్యులు ఏరుకొండ అనూష మధుకుమార్, స్నేహితులు సహకారంతో విరాళం అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్రతినిధులు బల్ల మధు కుమార్, హర్ష, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పూర్తికాని సీసీ రోడ్డు



విశాలాంధ్ర - నల్లజర్ల : మండలంలోని నబి పేట గ్రామం నుంచి నల్లజర్ల నుంచి కోయిలగూడెం వెళ్లి కలిసే ఈ మార్గము ఎప్పుడో అమలు అయింది. ఈ మార్గము పొలంలో నుంచి మెయిన్ రోడ్డుకి కలుస్తుంది. ఆ రోడ్డు వేయ దానికి వచ్చిన కాంట్రాక్టర్లు కొలతలు కొలిచారు. ఆ రోడ్డుకి అప్పుడప్పుడు కొంచెం కొంచెం పని చేస్తున్నారు. ఆ రోడ్డు మీద ఎప్పుడూ కూడా పూర్తిగా కంకర వేయలేదు. వారికి గుర్తు వచ్చినప్పుడల్లా కొంచెం కొంచెం వేస్తున్నారు. ఇంకా కిలోమీటర్ వేయవలసి ఉంది. ఆరోడ్డు కూడా వేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాకాలంలో ఆరోడ్డు ప్రయాణం చేయడానికి సులువుగా ఉంటుంది. ఆరోడ్డును త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు. అధికారులు, గ్రామ పెద్దలు కాంట్రాక్ట్ తీసుకున్నవారు వెంటనే స్పందించి ఆ దారి పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

పిల్లల శ్రమ దోపిడీపై అవగాహన



విశాలాంధ్ర - రాజానగరం : మనుషుల అక్రమ రవాణా నిర్మూలన సమిష్టి కృషితోనే సాధ్యమని ఐకెపి ఏపీఎం హేమా నాగలక్ష్మి అన్నారు. హైదరాబాద్ కి చెందిన ప్రజల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా అనే అంశంపై రాజనగరంలో బుధవారం జరిగిన అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు,చిన్న పిల్లలు పై జరుగుతున్న అక్రమ రవాణా అరికట్టడంలో అందరూ భాగస్వామ్యం కావాలి కోరారు. ప్రతి గ్రామాలల్లో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్ ఏర్పాటుతో అందరూ అప్రమతంగా ఉంటారన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి ఎం.రామన్న దొర మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా పరిగణంలోకి వస్తుందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు వీరి ఉచ్చులో పడుతున్నారని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహనా ఉండాలన్నారు. ఈ శిక్షణలో విలేజ్ ఆర్గనైజషన్ అసిస్టెంట్‌లకి లఘు చిత్రాల ద్వారా అవగాహనా కల్పించారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్యశృతి కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్స్, సిసిలు వీవోఎలు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై వృద్ధాశ్రమంలో అవగాహన



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు వృద్ధులు, దివ్యాంగులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు స్వీప్ నోడల్ అధికారి, సర్వశిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్ట్ సమ న్వయకర్త ఎస్. సుభాషిణి తెలిపారు. స్థానిక లాలా చెరువు గౌతమి జీవకారుణ్య సంఘం వృద్ధాశ్రమంలో బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెయస్ జ్యోతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుని, ఎందరికో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. 85 సంవత్సరాల పైబడిన వృద్ధులకు, వికలాంగులకు వారూ నివాసం ఉండే చోట ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్నీ ఎన్నికల సంఘం కల్పించిందని తెలియచేశారు. మీకు ఇక్కడ ఓటు లేకుండా వేరే చోట ఉన్నా కూడా ఇక్కడికి ఫారం 8 ద్వారా బదలీ చేసుకునే వెసులుబాటు ఉందని స్పష్టం చేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం-గోకవరం

తూర్పు గోదావరిజిల్లా

టెండరు నోటీసు తేది: 20-03-2024

తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం **గోకవరం** గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ పనులను **2024-25వ** సంవత్సరమునకు నిర్వహించుటకుగాను **ది.23-03-2024 తేదీ శనివారం మధ్యాహ్నం 3.00గంటలకు** గోకవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వారిచేగాని వారిచే అధికారం ఈయబడిన మరియొకరిచేగాని సీలు వేయబడిన టెండర్లు స్వీకరింపబడి అదేరోజున హాజరైన టెండరుదారుల సమక్షములో **సాయంత్రం గం॥ 3.30ని॥** తెరవబడునని ప్రకటించడమైనది. టెండరు దాఖలు చేయువారు నిర్ణయించిన టెండర్ ధరావత్తును చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. ధరావత్తులు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. ఇతర వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయం పనిచేయు దినములలో తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	ఐటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు
1.	2024-25 సంవత్సరమునకు కన్సప్షన్సీ సామానుల సరఫరా	రూ.500/-
2.	2024-25 సంవత్సరమునకు అవసరమగు ముగ్గు, బ్లీచింగ్ ఫినాయిల్ సరఫరా	రూ.500/-
3.	2024-25 సంవత్సరమునకు రక్షిత మంచినీరు పథకం పైపులైను సామాగ్రి సరఫరా	రూ.500/-
4.	2024-25 సంవత్సరమునకు పారిశుధ్య నిర్వహణ నిమిత్తం 4గురు డ్రైన్ క్లీనర్లును సరఫరా చేయుటకు	రూ.500/- (ఒక్కొక్కరికి)
5.	2024-25 సంవత్సరమునకు పి.డబ్ల్యు.యస్. బోరు ఆపరేటర్ (4)గురు	రూ.500/- (ఒక్కొక్కరికి)
6.	2024-25 సంవత్సరానికి పారిశుద్ధ్యం నిమిత్తం 28 (25+3) మంది మనుష్యులు మరియు 1 శానిటరీ మేస్త్రీని ఒక ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా సరఫరా చేయుటకు.	రూ.5000/-
7.	2024-25 సంవత్సరానికి పంచాయతీ ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేయుటకు 4 మనుషులు	రూ.500/-
8.	2024-25 సంవత్సరంనకు కంప్యూటర్ ఆపరేటర్ సేవలు వినియోగించుటకుగాను	రూ.500/-
9.	2024-25 సంవత్సరంనకు నైట్ వాచ్‌మేన్ సేవలు వినియోగించుటకుగాను.	రూ.500/-

నోటు : నిధుల లభ్యతను బట్టి పేమెంటు జరుపబడును.

స్థలం : గోకవరం
తేది : 20-03-2024

టి. శ్రీనివాసరావు,
పంచాయతీ కార్యదర్శి, గోకవరం

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ప్రతీ ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తారు
- ఎన్నికల ప్రచారానికి, ర్యాలీలకు ప్రదర్శనలకు అనుమతులు తప్పనిసరి
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాధవీలత

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌ను (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అనుసరించి ప్రవర్తించాల్సి ఉంటుందనీ, ఎవరైనా ఉల్లంఘిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. కే. మాధవీ లత స్పష్టం చేశారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ డాక్టర్ మాధవీలత బుధవారం మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికలను పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల అయినందున ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని, మార్గదర్శ కాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు అనుమతులను తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ఖచ్చితంగా అమలుచేయ డానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. రాజకీయ ప్రతినిధులు, ఎవరైనా పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీ లు, హోర్డింగ్స్, హోమ్ టు హోమ్ ప్రచారం, సమావేశాలు, సభలు, వాహనాలతో ప్రచారం క్యాం పైన్ నిర్వహణకు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాల న్నారు. ఆటోలు, బస్సులు, ప్రజా రవాణా వాహనాల్లో అనుమతి లేకుండా రాజకీయ పార్టీల స్టిక్కర్లు, బ్యానర్లు పెట్టకూడదని స్పష్టం చేశారు. పేపర్లలో ప్రకటనలు ఇవ్వడానికి ముందస్తు అను మతి అక్కరలేదని, పెయిడ్ న్యూస్ ను అభ్యర్థుల ఖాతాలో ఖర్చుగా రాయడం జరుగు తుందని వివరించారు. సింగిల్ విండో విధా నంలో, రిట ర్నింగ్ అధికారుల ద్వారా అన్ని రకాల అనుమ తులు మంజూరు చేస్తారని చెప్పారు. వీలై నంత వరకు సువిధ యాప్ అనుమతులకు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. జరుగుతున్న అభివృద్ధి పనులు కొనసాగుతాయని, కొత్త పనులు మంజూరు చేయరని అన్నారు. జిల్లాలో మొత్తం 1577 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అన్ని పోలింగు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అన్ని వసతులను కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొ న్నారు. ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. వాటికోసం వచ్చే ధరఖాస్తులను పరిశీలిం చరని ఆమె చెప్పారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి ఫారం 6 ద్వారా 18 నుంచి 21 ఏళ్ల మధ్య ఉన్న వారికి, ఫారం - 8 ద్వారా ఒక చోట నుంచి మరో చోటకి ఓటు బదిలీకి మాత్రం అవకాశం ఉందని మాధవీలత అన్నారు.

హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు



విశాలాంధ్ర - కాకినాడ : మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి సమస్యలు, సందేహాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరావు తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్ నిర్వహణపై ఎన్నికల అధికారులకు బుధవారం పలు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు 24 గంటలూ పనిచేసేలా మూడు షిఫ్ట్‌లలో 12 మంది ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఏమైనా ఫిర్యాదులు ఉన్నా, సందేహాలు ఉన్నా హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్ 0884-2349400కు సమాచారం అందజేయవచ్చని తెలిపారు.

లాటరీవద్దు.. మా దుకాణాలు మాకే కేటాయించాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జాంపేట చేపల మార్కెట్‌లో లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించవద్దని, ఎవరి దుకాణాలలో వారే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని జాంపేట హోల్‌సేల్ రిటైల్ చేపల మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, వై.రమేష్, నక్కానాగమ్మ తదితరులు మాట్లాడారు. జాంపేట చేపల మార్కెట్ గౌరవాధ్యక్షుడుగా చెప్పుకుంటున్న వెలమ లక్ష్మణరావుకు ఈ మార్కెట్‌తో సంబంధంలేదని కోటేశ్వరరావు స్పష్టం చేశారు.అతను రాజ కీయ పలుకుబడితో కులాలను రెచ్చగొట్టి మార్కెట్‌లో రభస చేస్తున్నాడని ఆరోపించారు. లక్ష్మణరావు, వెలమలక్ష్మి, నిర్వహిస్తున్న మూడు సంఘాలు ఎక్కడో దూరంగా ఉన్నాయని వాటితో జాంపేట చేపల మార్కెట్‌కు సంబం ధం లేదని కోటేశ్వరరావు,రమేష్ చెప్పారు. వారి కూడా వచ్చిన కొంతమంది చేపలు కోసే వారికి ఈ మార్కెట్ తో సంబంధం లేదన్నారు. కిలో చేపకాని, రొయ్యలు కాని చేయాలంటే కొనే ప్రజలు నుంచి తక్కువ చార్జీ వసూలు చేయాలని తాము సూచించామని కాదని వారు రూ.50 అంతకన్నా ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆరోపించారు.వెలమ లక్ష్మణరావు ఇసుక ర్యాంపులో దొంగ ఇసుక విక్రయాలు చేయడంతో అతనిపై గతంలో కేసు నమోదు చేశారని, వికలాంగుల పేరుతో దుకాణాలు తీసుకుని అతనే నడుపుకుంటున్నాడని, ఇప్పుడు జాంపేట చేపల మార్కెట్‌లో కొన్ని దుకాణాలు కొట్టేయాలని కోటేశ్వరరావు, రమేష్ ఆరోపించారు.నక్కా నాగమ్మ మాట్లాడుతూ తమ పెద్దల హయాం నుంచి వచ్చిన ఈ దుకాణాలవద్ద వ్యాపారం చేసుకునే అవకాశం తమకే ఇవ్వాలని కోరింది.ఈ కార్యక్రమంలో సి.హెచ్. సత్యనారాయణ, నాగు,నక్కా శీనమ్మ,సి.హెచ్.ఎల్లయ్య,కె.అశోక్,చిన్నారి దుర్గ, రమణమ్మ పాల్గొన్నారు.

మద్దతిస్తా లేనిపక్షంలో పోటీ చేస్తా : వర్మ

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో బి ప్రత్తిపాడు, గోర్స గ్రామాల నుంచి పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి వర్మ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసీపీ వల్ల ప్రజలు విసుగు పోయారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే రైతులకు రెండు పంట లకు పుష్కలంగా నీరు అందించి కరువు లేకుండా చేస్తారని అన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. అదేవిధంగా దుర్గాడ గ్రామస్థులతో మాట్లాడుతూ పిఠాపురం అభ్యర్థిగా పవన్ పోటీ చేస్తే తప్పకుండా చంద్రబాబు ఆదేశాలు మేరకు పవన్‌న్ని గెలిపించాలని వారిని కోరారు. ఎఫ్‌కే పాలెంలో జరిగిన జనసేన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వర్మ పవన్ పిఠాపురం నుండి పోటీ చేస్తే తన మద్దతు ఉంటుందని, పవన్ ఇక్కడ నుండి పోటీ చెయకపోతే తాను పోటీలో కచ్చితంగా ఉండడం జరుగుతుందని తెలిపారు.

నాటు సారా స్వాధీనం



విశాలాంధ్ర - ఆత్రేయపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నాటు సారాను నిర్మూలించేందుకు డా బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తపేట సబ్-డివిజన్ డీఎస్పీ కె.వి. రమణ పర్యవేక్షణలో రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సబ్‌ఇన్స్పెక్టర్ యస్. శ్రీనివాస్ వారి సిబ్బంది సాయంతో పేరవరం గ్రామ శివారులో అక్రమంగా నాటుసారా తరలిస్తున్న స్థానికులు పాములు, సత్తిబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతను వద్దనుండి 10 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, కొత్తపేట కోర్టుకి రిమాండుకి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసు తెలిపారు.

ప్రజలు ఎన్నికల నియమావళి పాటించాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : ఎన్నికల నియమావళి పట్ల పౌరులు అవగాహన కలిగి ఉండాలని నగరం ఎస్ఐ పివిఎస్ఎస్. ఎన్. సురేష్ అన్నారు. మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని అన్నారు. ఎన్నికల నియమావళి పట్ల, ఎన్నికల్లో ప్రజల పాత్ర పట్ల ప్రజలకు, పౌరులకు అవగాహన కల్పించడం కోసం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పోలీసు ఫ్లాగ్ మార్చ్ (పోలీసు కవాతు) కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాన్నారు. బాధ్యతగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెడితే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కేంద్రబలగాలతో పెదపట్నం లంక గ్రామంలో కవాతు నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణపై ఆన్‌లైన్ శిక్షణ

విశాలాంధ్ర - కాకినాడ : త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్నికల అధికారులకు బుధవారం ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్, లడక్, కేరళ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఎన్నికల అధికారులు హాజరయ్యారు. కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే. వెంకటరావుతో పాటు పలువురు అధికారులు కాకినాడ నుంచి ఆన్‌లైన్ శిక్షణకు హాజరయ్యారు. నామినేషన్ల అర్హత, అనర్హత, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్ రోజున చేయాల్సిన ఏర్పాట్లు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో రిటర్నింగ్ అధికారి జే. వెంకటరావుతో పాటు మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌కు సంబంధించిన వివిధ బృందాల అధికారులు పి.సత్య కుమారి, ఎం. ఏసుబాబు, హరిదాసు, నాగశాస్త్రులు,దొర అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా కూలీలు మృతి

విశాలాంధ్ర-పెద్దాపురం: లారీ చక్రాల క్రింద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం రహ దారిలోని లలితా రైస్ మిల్లులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పెద్దాపురం పట్టణం రాజీవ్ కాలనీకి చెందిన కామిశెట్టి కామేశ్వరి (51) మండలంలోని కట్టమూరుకు చెందిన మోతు పల్లి నాగర్నతం (65) యథావిధిగా రైస్ మిల్లులో పనికి వెళ్లారు. రోజు మాదిరిగానే వారు క్లీనింగ్ పనిలో వర్షం పడుతుండడంతో పక్కనే గోడ వారనే నిల్చున్నారు. వర్షం వస్తుందని లారీ పక్కకు జరిపేందుకు వెనకకు తిప్పుతుండగా గోడ పక్కనే ఉన్న వారిని బలంగా లారీ డ్రైవర్ అదుపు తప్పి వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు నాగరత్నంకు నలుగురు కుమారులు కాగా ఒంటిరిగా పింఛన్ సొమ్ముతో జీవిస్తూ రైస్ మిల్లులో కూలీపనికి వెళ్లుతూ జీవనం సాగిస్తుంది. మృతురాలు కామేశ్వరికి భర్త లేకపోవడంతో ఆమె కూలీ నిమిత్తం రైస్ మిల్లులో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. పెద్దాపురం ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతబస్సులతో ప్రయాణికులకు ఇబ్బందులు

- డ్రైవర్లు, కండక్టర్లు తీరుపై అసహనం
- కన్నెత్తిచూడని రవాణాశాఖ?



విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : బస్సు చక్రం ప్రగతికి చిహ్నం ఒక్కప్పటి మాట, ఇప్పుడు ఆ బస్సులో ప్రయాణించాలంటే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు హడిలి పోతున్నారు. నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల నుంచి ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణికులు రాజ మహేంద్రవరం తరచూ వచ్చి వెళ్తుంటారు. వాణిజ్య, వ్యాపారంపరంగా పలువురు చిరు వ్యాపారులు కొనుగోలు చేసిన సామగ్రిని అయాబసుల్లో వారి గ్రామాలకు రవాణా చేస్తుంటారు. మరో వైపు ఉన్నత చదువులు కోసం విద్యార్థులు ఆర్టీసి బస్సులుపైనే ఆధారపడి ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం నుంచి రాజమహేంద్రవరం డిపో, కలెక్టర్ కార్యాలయం మీదుగా నడిచే బస్సులు పాత బస్సులు కావడంతో తరుచూ బ్రేక్ డౌన్, ఇంజిన్ సమస్యలు వచ్చి పలుసార్లు బస్సులు రోడ్డు పై ఆగిపోతున్నాయి. దీంతో వెనుక వచ్చే మరో బస్ కోసం గంటల సమయం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఇటీవలే రామచంద్రపురం ఏటి గట్టు రోడ్డు పై అదుపుతప్పి అడ్డంగా తిరిగిపోవడంతో ఎత్తైన గట్టు క్రిందకి పడిపోకుండా డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించిన తీరుతో బస్సులో ఉన్న 36 మంది ఊపిరి పీల్చుకున్నారు. కాలం చెల్లిన బస్సులను తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో ఆర్టీసా చెలగాటం ఆడుతున్నదని ప్రజలు పెద్దఎత్తున విమర్శించారు. ఇటీవలే ఇంటర్ పరీక్షలకు కోసం వెళ్తున్న పలువురు విద్యార్థులు, మహిళలు, ప్రయాణికులు ఎక్కిన బస్సు మార్గ మధ్యలో రాజానగరంలోని నుకాలమ్మ ఆలయం సమీపంలో ఆగిపోవడంతో విద్యార్థులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. కాలంచెల్లిన పాత బస్సులో ప్రయాణం చేయడం తమకు శాపంగా మారిందని విద్యార్థుల అవేదన వ్యక్తం చేశారు. మరి కొంత మంది డ్రైవర్లు, కండక్టర్లు రాత్రి పూట సైతం బస్ గేట్ వద్ద నిలబడి బస్ ఎక్కద్దు, మరో బస్ ఎక్కండి అని హుకుం ప్రదర్శిస్తు న్నారని ఆరోపించారు. పురుషోత్తపట్నం వెళ్లేందుకు రాత్రి ఏడు గంటల బస్ దాటితే మళ్ళీ తొమ్మిది వరకు బస్సు లేదని రాత్రి వేళ మరో నాలుగు బస్సులు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. కండక్టర్,డ్రైవర్లు తీరుతో ప్రతిసారి వార్తల్లో నిలుస్తున్నప్పటికి ఆర్టీసి అధికారులు చోద్యం చూస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఎద్దేవా చేశారు. రవాణా శాఖాధికారులు మాత్రం కాలం చెల్లిన బస్సుల వంక కన్నెత్తి ఎందుకు చూడరని పలు వురు ప్రశ్నించారు. ఇప్పటికైనా కాలంచెల్లిన పాత బస్సులను పక్కనబెట్టి నూతన బస్సులు వేయాలని డిమాండు చేశారు. కళాశాల వేళల్లో బస్సులు సంఖ్య పెంచాలని,రాజానగరం, కోరు కొండ, సీతానగరం చదువులు కోసం రాజమహేంద్రవరం వెళ్తున్న విద్యార్థులకు ఆర్టీసీ కనీస సౌక ర్యాలు కల్పించాలని, కళాశాల వేళల్లో బస్సుల సంఖ్య పెంచాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

పరిసరాల పరిశుభ్రతలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విశాలాంధ్ర - సీతానగరం : ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా బుధవారం సింగవరం గ్రామపంచాయతీ పరిధిలో నాగరత్నం కాలనీలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఆఫీసర్ ఎమ్ సుధామయి విద్యార్థులతో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధామయి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కాలనీలోని సీసీ రోడ్డుపై ఉన్న మట్టి గుంతలను పూడ్చారు. డ్రైనేజీలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మధ్యాహ్నం ఎడ్యుకేషన్ ఇంపార్టెన్స్ అనే అంశం పై ఎంపీపీ పాటశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీమతి నాగమణి విద్యార్థులకు ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ఫణేంద్ర, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తరలిపోతున్న ఎర్రకాలువ ఇసుక

విశాలాంధ్ర - నల్లజర్ల : మండలంలోని నబీపేట గ్రామంలోని ఎర్రకాలువ నుంచి ఇసుక పోటా పోటీగా తరలిపోతుంది. గ్రామంలో ఉన్నవారికి ఇసుక కొరతైపోతుంది చుట్టుపక్కల గ్రామాల వారికి విచ్చల విడిగా దొరుకుతుంది. ఇసుక దూర ప్రాంతాలకు తరలించి అధికంగా యజమానులు. సోమ్ము వసూలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా కూడా యధేచ్ఛగా ట్రాక్టర్లు, లారీల మీద తరలిపోతుంది.అయినా పట్టించుకోనే వారులేరు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని దీనిని ఆపివేయాలని నబిపేట గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రభుత్వ స్వయంప్రతిపత్తి (ఆర్ట్స్) కళాశాలలో రసాయన శాస్త్రవిభాగం విద్యార్థులు బెంగళూరు లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ క్షేత్ర పర్యటనకు బయలుదేరారు. ఈనెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ పర్యటన జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్.కె. మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి క్షేత్ర పర్యటనలు శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనా జిజ్ఞాసను పెంచుకోవడానికి, సహకరిస్తాయని పేర్కొన్నారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ పర్యటనలో క్రమశిక్షణతో అత్యంత ప్రతిభావంతమైన శాస్త్రవేత్తల నుంచి వారి పరిశోధనల నుంచి జ్ఞానాన్ని సంగ్రహించాలని తెలిపారు. ఈ పర్యటనకు రసాయన శాస్త్ర విభాగం నుంచి జాకబ్, శ్రీధర్ , సురేష్ , మల్లికార్జున , త్రినాధ్ , సురేఖ , శాంత కుమారి, భార్గవి, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలో వ్యవసాయ అధికారి కెవిఎస్ రమేష్‌కుమార్ బుధవారం మాట్లాడుతూ సాగు సజావుగా సాగాలంటే సకాలంలో నీరు సరిపడగా అందాలి. అందుకోసం నీటి వనరులలభ్యత, ఏ దశలో ఎంత మేరకు నీటి తడులు పెట్టాలన్న దానిపై రైతుకు అవగాహన అవసరం. ఆ తర్వాత అవసరమైన మేరకు ఎరువులు పురుగు మందులను పిచికారీ చేయాలి. మందును పిచకారీ చేసేటప్పుడు పంట సస్యరక్షణతో పాటు తన ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ పనుల్లో కాయ కష్టం చేయడం అలవాటైనదే అయినప్పటికీ పంటకి ఎరువులు, పురుగు మందులు వాడేటప్పుడు రైతు శారీరకంగా మానసికంగా అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. మరి ముఖ్యంగా మందులను పిచికారి చేసే యంత్రాల వినియోగంలో అవగాహన అవసరం. పురుగుమందులను పిచికారి చేసేటప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు, వైద్య సూచనలు పాటించాలి. పిచకారి పచచేసిన మందుడబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి. పురుగుల మందు ప్రభావంతో అస్వస్థతకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స చేయాలి.

పోషకాహారం తీసుకోవాలి



విశాలాంధ్ర - జగ్గంపేట : గర్భిణులు, బాలింతలు పోషక విలువలు ఉండే ఆహారాన్ని తీసుకో వాలని ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ సూచించారు. జగ్గంపేట ఐసీడీఎస్ ప్రోజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం కాత్రావులపల్లిలో నిర్వహించారు. ఈ పూర్ణిమ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఏవిధంగా తీసుకోవాలి అనే విషయాలను తెలియజేశారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం కూడా గర్భవతులు, బాలింతలు ఉపయోగించుకోవా లన్నారు. వెయ్యిరోజుల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సునీత, అమ్మాజి, హెల్త్ సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

కాకినాడ నెహ్రూ యువ కేంద్రం అధ్వర్యంలో

విద్యార్థులకు అటల పోటీలు

విశాలాంధ్ర - జగ్గంపేట : అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్క రించుకుని కాకినాడ నెహ్రూ యువ కేం ద్రం అధ్వర్యంలో జగ్గంపేట ప్రభుత్వ మోడ ల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆటల పోటీలు బుధవారం నిర్వహించారు. విద్యా ర్థులకు కబడ్డీ, రన్నింగ్, విద్యార్థినిలకు ఖోఖో పోటీలు నిర్వహించడంతో వారు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ పోటీలను ఎన్‌వైకే వలంటీర్లు అప్పన్న, పుష్ప, ప్రవల్లిక, పెన్నదదేవి నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్స్ అందిస్తామని వలంటీర్లు తెలిపారు.

చేబ్రోలులో జంటహత్య కలకలం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : మండలంలోని చేబ్రోలు గ్రామ శివారులో లక్ష్మీపురం పంట పొలాల్లో బుధవారం అక్రమ సంబంధం నేపథ్యంలో జంట హత్యలు కలకలం రేపాయి. కొంత కాలం నుంచి లోకనాగ బాబుతో పెండ్యాల లోవమ్మ సహజీవనం చేస్తుంది. ఇటీవల పెండ్యాల లోవమ్మ, పోసిన శ్రీనుతో కొత్తగా అక్రమ సం బంధం కొనసాగుతుంది. వీరిద్దరూ కలిసి ఉన్నారనే సమా చారం తెలుసుకున్న లోక నాగబాబు బుధవారం ఉదయం పొలంలో పోసిన శ్రీను పెండ్యాల లోవమ్మలపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేశారు. దీంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. అక్రమ సంబంధానికి సహకరించిందనే ఉద్దేశంతో పెండ్యాల లోవమ్మ తల్లి విసరపు రామలక్ష్మి పై కూడా నాగబాబు దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలవడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనింగ్ డీఎస్పీ ప్రమోద్, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్ఐ బాలాజీ చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వానికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలాజీ తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర - కైకలూరు : వైసీపీ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి జరిగిందని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరు పరిధిలోని 17,18వ వార్డులలో వెలమపేట లో 18వ రోజుగా జరిగిన గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమానికి నాయకులతో కలసి పాల్గొని ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజాపాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలంటూ ప్రజలకు అభివాదం తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యే డిఎన్ఆర్‌కు స్వాగతం పలుకుతూ దుశ్శాలువాలు కప్పి వారు చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధి చెందేలా అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

యువతలో రాజకీయ చైతన్యం పెంపొందాలి

విశాలాంధ్ర- పెదవేగి: విద్యా, ఉద్యోగ అంశాలతో పాటు సమకాలీన రాజకీయ పరిస్థితులపై కూడా యువతలో చైతన్యం కలిగి ఉండాలని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు గ్రామానికి చెందిన సంజయ్ బాబీ ఆధ్వర్యంలో దాదాపు 50మంది యువత బుధవారం దుగ్గిరాలలోని నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుని చింతమనేని ప్రభాకర్ నాయకత్వంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరిని పేరు పేరునా పలకరిస్తూ అభినందించారు. రాబోయే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపు జెండా ఎగుర వేయడంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక చొరవ చూపాలని చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత 5 ఏళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిలిచి పోయి రాష్ట్రంలోని లక్షలాది మంది యువత భవిష్యత్తు అంధకారంగా మారిపోయిందన్నారు. టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి ప్రభుత్వంలో యువతకు బంగారు భవిష్యత్తు అందించేలా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం అని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెదపాడు మండల అధ్యక్షులు లావేటి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జి ముళ్ళపూడి సాంబశివరావు, నూతలపాటి నవీన్, యాధాన దయాకర్, భీమరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జైన్‌భగవాన్ దేవాలయంలో వేటుకూరి పూజలు

విశాలాంధ్ర-కాళ్ళ : ఉండి నియోజకవర్గంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు(కలవపూడి శివ) అన్నారు. కాళ్ళ మండలం పెదఅమీరంలోని ఆదినాథ్ జైన్ భగవాన్ దేవాలయంలో కుటుంబ సమేతంగా పూజలు జరిపి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధవారం ప్రచారం ప్రారంభించారు. ఈసందర్భంగా పార్టీలకు అతీతంగా మహిళలు, పురుషులు ఆయనకు పూలతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పని చేశానన్నారు. ఉండి ప్రజలు 2009, 2014లో ఎనలేని ఆదరణ నాకు చూపారని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజల నుంచి తనకు అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. 2019లో అధిష్టానం నిర్ణయం మేరకు నరసాపురం ఎంపీగా పోటీ చేయాల్సి వచ్చిందని, మరలా ఉండి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని అధిష్టానానికి తెలిపినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఒక్క మాట కూడా చెప్పకుండా ఉండి నియోజకవర్గం సీటు రామరాజుకు కేటాయించారని నాకు ఆ విషయం చాలా బాధ కలిగించిందన్నారు. ఉండి ప్రజల నిర్ణయం మేరకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని స్పష్టం చేసారు. ఈకార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర - పెంటపాడు: ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలాజీ వెంకటరమణ అన్నారు. రానున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం పెంటపాడు మండలం పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు సి విజిల్ యాప్ పై అవగాహన కల్పించి, మండల తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ సి విజిల్ యాప్ ను మండల పరిషత్ సాంకేతిక సహాయకుల ద్వారా పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ ల మొబైల్లో డౌన్లోడ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి, ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ కార్యాలయ భవనాలు, ప్రభుత్వ అండర్ టేకింగ్ భవనాలు, ప్రైవేటు భవనాలపై ఎటువంటి రాజకీయ పార్టీల హోర్డింగ్స్,పోస్టర్స్ ఏర్పాటు చేయకూడదని అన్నారు. ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు.

గొనేపాడులో శివాలయం ప్రారంభం

విశాలాంధ్ర - కైకలూరు : మండలంలో గొనెపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ జలలింగేశ్వర స్వామి వారి ఆలయం ప్రారంభోత్సవంలో కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు,శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని పూజలు నిర్వహించారు. మండలం లోని గొనెపాడు గ్రామంలో స్వయంభూ గా వెలిసిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ జలలింగేశ్వర సహిత జీవధ్వజ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవము అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ జలలింగేశ్వర స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని అన్నారు. అనంతరం మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు,రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, సర్పంచ్ బత్తిన శ్రీకాంత్ , కైకలూరు పిఏసియస్ అధ్యక్షులు పంజా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభన్‌బాబు వర్ధంతి

విశాలాంధ్ర -భీమవరం: కుటుంబ కథ చిత్రాల కథానాయకుడిగా శోభన్ బాబు ప్రజల హృదయాల్లో కలకాలం నిలిచివుంటారని, ఆయన మరణం సినీ ప్రపంచానికి తీరని లోటని పలువురు వక్తలు నివాళులు అర్పించారు. అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని భీమవరంలో నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన మరణించి 16 ఏళ్లు గడిచినా శోభన్ బాబు పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఇక మీద కూడా చేస్తూనే ఉంటామని నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, సభ్యులు కంచర్ల భాస్కరరావు గుప్తా, బొండా రాంబాబు,స్వాతి భాస్కరరావు,అడ్డాల సత్యనారాయణ,కారుమూరి సుబ్బారావు, ఇందుపు కరుణకుమార్, గదాం నాని, వంగా జీవా, ప్రసాద్, ఆటో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర - ఏలూరు: వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని తేదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ విమర్శించారు. బుధవారం స్థానిక మూడవ డివిజన్‌లో టిడిపి ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. బాబు షూరిటీ, భవిష్యత్ గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అవినీతి, దోపిడిలో వైకాపా నేతలు పోటీపడ్డారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వైకాపా ప్రభుత్వం సొంత స్టిక్కర్లు వేసుకుంటూ తామే ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన తరువాత రాజకీయాలు పెడదారిన పట్టాయని, వ్యక్తిగత కక్షపూరితమైన పాలనకు తెర తీశారని ధ్వజమెత్తారు. జగన్ విధ్వంసక పాలనతో రాష్ట్ర పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాలంటే పరిశ్రమలు పెరగాలని, అది చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా బడేటి చంటిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

జనంలోకి జనసేన

విశాలాంధ్ర-నర్సాపురం: జనసేన, తెదేపా, బీజేపీ కూటమితో ప్రభుత్వంతోనే ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతాయని జనసేన నరసాపురం ఉమ్మడి అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 23వ వార్డు రాయిపేటలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. వార్డు లోని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఘంటా కృష్ణ, పోలిశెట్టి నళిని, అడబాల రమేష్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, గుబ్బల మార్రాజు, బందెల రవీంద్ర,వలవల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన డిప్యూటీ సీఎం కొట్టు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం పలువురిని పరామర్శించారు. ఇటీవల కాలంలో పరమపదించిన వారి కుటుంబాలను కలిసి ఓదార్చారు. ముందుగా పట్టణంలోని వాసవి ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ చలంచర్ల సుబ్బారావు ఇంటికి వెళ్లారు. ఇటీవల సుబ్బారావు సతీమణి సాయి నవ భారతి కన్ను మూశారు. దీంతో సుబ్బారావును మంత్రి కొట్టు పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం పెంటపాడులోని ఎంపీపీ దాసరి హైమావతి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల హైమావతి మరిది దాసరి సూర్య ప్రభాకర్ మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మంత్రి కొట్టు పరామర్శించారు. తదనంతరం పెంటపాడు లోనే ఆ గ్రామ మాజీ సర్పంచ్ నల్లిమిల్లి చిన్న వెంకటరెడ్డి సతీమణి అన్నపూర్ణ ఇటీవల కన్ను మూయడంతో మంత్రి కొట్టు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి నాయకులు కొట్టు విశాల్ ఉన్నారు. ఈ కార్యక్రమాలలో పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, పెంటపాడు మండలం యూత్ ప్రెసిడెంట్ కొవ్వూరి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మేడపాటి చెల్లారెడ్డి, నల్లిమిల్లి అంజిరెడ్డి, కొట్టు విశాల్, దేవాబత్తుల బాబి, తదితరులు పాల్గొన్నారు.

అడవికొలనులో జనంలోకి ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: జనంలోకి ధర్మరాజు కార్యక్రమంలో భాగంగా బుధవారం నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పత్సమట్ల ధర్మరాజు గ్రామ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సంద ర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాబోయే ఎన్నికల్లో "గాజు గ్లాస్ గుర్తుకు" వేటు వేసి జనసేన - టీడీపీ - బీజేపీ పార్టీల కూటమిని గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, నియోజకవర్గ జనసేన నాయకులు, గ్రామ జనసైనికులు, టీడీపీ నాయకులు, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర-పాలకోడేరు: మండలంలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మూడవరోజు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలిపారు. మూడవ రోజు హిందీ పరీక్షకు మండలం లో 606 మంది విద్యార్థులు హాజరు అవ్వవలసి ఉండగా 594 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పాఠశాలల వారీగా పాలకోడేరు హై స్కూల్ నుండి 145 మంది విద్యార్థులు హాజరవలసి ఉండగా 141 మంది విద్యార్థులు హాజర య్యారని 4 గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని, శృంగ వృక్షం హై స్కూల్ నుంచి 157 మంది విద్యార్థులు హాజరవలసి ఉండగా 156 మంది విద్యార్థులు హాజరయ్యారని ఒకరు గైర్హాజరయ్యారని, విస్సాకోడేరు హై స్కూల్ నుండి 60 మంది విద్యార్థులకు 59 మంది విద్యార్థులు హాజరై ఒకరుగైర్హాజరయ్యారని, మొగల్లు హై స్కూల్ నుండి 126 మంది విద్యార్థులకు, 120 మంది విద్యార్థులు హాజరై ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఉమ్మడి అభ్యర్థి బొడిశెట్టిని అఖండ మెజారిటీతో గెలిపించాలి

విశాలాంధ్ర-పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించి తెదేపా జాతీయ అధ్య క్షులు, అధినేత చంద్ర బాబుకు బహుమతిగా ఇవ్వాలని టిడిపి తాడేపల్లి గూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. తేదేపా మండల తెలుగుదేశం కార్యకర్తలతో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పరిచయ కార్యక్రమం టిడిపి పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి తెలుగుదేశం, జనసేన పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు పాల్గొని బొలిశెట్టికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి పార్టీల అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు పవన్ నిర్ణయాలకు కట్టుబడి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబాబు, గొర్రెల శ్రీధర్, పరిమి రవికుమార్,దాసరి అప్పన్న, గంధం సతీష్,పుల్లా బాబి, దాసరి కృష్ణవేణి, కసిరెడ్డి మధులత, కొల్లూరి బాబు, ముప్పిడి రమేష్, తెలుగుదేశం,జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలుగుదేశంలోకి చేరికలు

విశాలాంధ్ర-తణుకు: ఐదేళ్ల వైసిపి పాలనలో బీసీలంతా విసిగిపోయారని తణుకు మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అభిప్రాయపడ్డారు. చరిత్రలో ఈ మాదిరిగా బీసీలను వేధించిన ప్రభుత్వం లేనేలేదని, బీసీల పట్ల కక్ష సాధింపునకు వైసిపి ప్రభుత్వం పాల్పడిందని అన్నారు. ఇరగవరం గ్రామ శివారు చిన్న రాముని చెరువు, పిల్లి వారి పాలెం గ్రామాలకు చెందిన వందలాది కుటుంబాలు బుధవారం తెదేపాలో చేరాయి. ఆరిమిల్లి రాధాకృష్ణ టిడిపి కండువా కప్పి బీసీ సోదరులు, వారి కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. పార్టీలోకి వచ్చిన శ్రేణులు అందరికీ టిడిపి తరఫున తాము పూర్తిగా అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ గ్రామ పెద్దలు డాక్టర్ దొమ్మేటి సుధాకర్, ఇరగవరం మండల అధ్యక్షులు రామకృష్ణ, టిడిపి జిల్లా కార్యదర్శి వేండ్ల నాగు, పార్టీ గ్రామ అధ్యక్షులు జనార్ధన్ తదితర నాయకులు ఈ చేరికల్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశం ప్రభుత్వంలో, చంద్రబాబు నాయకత్వంలోనే న్యాయం జరుగుతుందన్న భరోసాతో వారంతా టిడిపిలో చేరారని ఆయన వివరించారు. బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు 50 సంవత్సరాలు దాటితే రూ.4వేల చొప్పున పెన్షన్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు వివరించారు. బీసీల మీద దాడుల్ని నివారించేందుకు బీసీ రక్షణ చట్టం రాబోతుందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో భాగం పంచుకోండి

విశాలాంధ్ర -భీమవరం: రాబోయే ఎన్నికల్లో తమ కూటమిని గెలిపించి రాష్ట్రాభివృద్ధిలో భాగం పంచుకోవాలని భీమవరం అసెంబ్లీ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. బుధవారం 36వ వార్డులో పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే తరాల భవిష్యత్తుకు తమ కూటమి బంగారు బాటలు వేస్తుందని హామీ ఇచ్చారు. ఉదయం పార్టీ కార్యాలయంలో పలు వర్గాల ప్రజలు జనసేన పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పిఏసి సభ్యులు కనకరాజు సూరి, నాయకులు బండి రమేష్, గాదిరాజు గంగతాతరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి: బడేటి చంటి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు కల్పించాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమిల ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక బడేటి క్యాంపు కార్యాలయంలో నగరంలోని 11 వ డివిజన్ దక్షిణపువీధికి చెందిన ఏలూరు నియోజకవర్గ వైసిపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి, ఆర్ఆర్ పేట శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యులు చోడే కిట్టు నందు టిడిపి 11 వడివిజన్ ఇంచార్జ్ చోడే బాలు ఆధ్వర్యంలో టీడీపీ లో చేరారు. కిట్టుకు బడేటి చంటి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న విధ్వంసకర పాలన నుంచి మరికొద్ది రోజుల్లోనే ప్రజలకు విముక్తి కలుగుతుందని చెప్పారు. ఎస్సి, ఎస్ టి లకు చెందిన 28, బీసీలకు సంబంధించి 30, మైనార్టీలకు సంబంధించి 11 పథకాలను రద్దు చేసిన సైకో జగన్‌కు ఓటు వేటెయ్యొద్దని కోరారు. టిడిపి, జనసేన, బీజేపీ కార్యకర్తల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే రానున్న ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంలో అతి భారీ మెజార్టీ ఖాయమని స్పష్టమవుతోందన్నారు. ప్రజలకు సేవచేసే అవకాశాన్ని ఒక్కసారి కల్పిస్తే వారి సమస్యలను చిత్తశుద్దితో పరిష్కరిస్తానని బడేటి చంటి హామీ ఇచ్చారు.

పరిశుద్ధ బహిరంగ సిలువ మార్గం

విశాలాంధ్ర-పెంటపాడు: ఏలూరు మేత్రాసనం తాడేపల్లిగూడెం(పాతూరు)విచారణ రావికుంట గ్రామంలో విచారణ గురువులు రెవ.ఫాదర్ కే.జోజి బాబు ఆధ్వర్యంలో పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ నుండి ముదునూరు చేరుకుని పరిశుద్ధ బహిరంగ సిలువమార్గం ద్వారా క్రైస్తవ విశ్వాసులు క్రీస్తు సిలువ ప్రదర్శన చేస్తూ రావికుంట ఆరోగ్యమాత టవర్ వద్దకు చేరుకుని ఆరోగ్యమాత వార్షికోత్సవం సభను ఘనంగా నిర్వహించారు. అనంతరం బహిరంగ ప్రార్ధన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కూడికలో రెవ.ఫాదర్ కే జోజి బాబు, రెవ.ఫాదర్ కుర్రం జోసఫ్ ఫాదర్ టీ.ప్రేమ్ కుమార్,ఫాదర్ మార్టిన్ లు, దివ్య పూజాబలి ని సమర్పించారు. ఫాదర్ జోసెఫ్ బోధిస్తూ యేసుక్రీస్తు మనకోసం సిలువలో రక్తం చిందించి, తన ప్రాణాన్ని సైతం అర్పించాడని, ఈ తపస్సు కాలంలో విశ్వాసులు దానధర్మాలు చెయ్యాలని, పుణ్యకార్యాలు, అన్న దానాలు ఎక్కువగా చేయాలని, క్రీస్తు చూపిన సత్య మార్గంలో నడవాలని, ఆరోగ్య మాతను వేడుకుంటే మన విన్నపాలను తన కుమారుడైన క్రీస్తుకు విన్నవించి సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందని, ప్రజలకు దైవ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపదేశి చిన్నం రాజు,సీనియర్ ఉపదేశి సురగాల ఇశ్రాయేలు, మారంపూడి రవి, ఆర్. ప్రసన్నకుమార్, రావికుంట సంఘ విశ్వాసులు, సహోదరులు, మాతలు, వివిధ గ్రామాల నుండి వచ్చిన విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం సమావేశం

విశాలాంధ్ర - పాలకొల్లు: జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘ సర్వసభ్య సమావేశం పాలకొల్లు మండలం చందపర్రు గ్రామంలో స్థానిక ట్రిబుల్ ఎస్.కళ్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆక్వా రైతులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం విచారకరమన్నారు. ఆక్వా రైతులు సమైక్యంగా లేకపోతే భవిష్యత్తులో తీవ్ర నష్టం ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఆక్వా రైతులంతా సమైక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం కార్యదర్శి బోనం వెంకట నరసయ్య (చిన్న బాబు) రుద్రరాజు సత్యన్నారాయణ రాజు, జాన్ రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఆక్వా రైతుసంఘం ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు ప్రతినిధులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

వైసీపీని గెలిపించండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం గ్రామం నుంచి లక్కవరం పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వైసీపీ బహిరంగ సభ వరకూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వైసీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయ రాజు వాహన ర్యాలీ లో పాల్గొని దారి పొడవునా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం లక్కవరం బస్టాండ్ సెంటర్లో ఉన్న ఆంజనేయస్వామి ని దర్శించుకున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేకును విజయరాజు కట్ చేశారు. లక్కవరంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని విజయ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ను ప్రజలంతా ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. చింతలపూడి ఎమ్మెల్యే గా తనకు,ఏలూరు ఎంపీ గా కారుమూరి సునీల్ కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, నాయకులు గురజాల పార్థ సారథి, మల్నీడి బాబీ,ముప్పిడి శ్రీనివాసరావు, ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - కలిదిండి: మండలంలోని భాస్కరరావు పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతా రామ లక్ష్మణ హనుమత్ శిలా విగ్రహాలు, ఆలయ శిఖరం, ధ్వజస్తంభ ప్రతిష్ట అత్యంత వైభవంగా బుధవారం ప్రతిష్టించారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ. వెంకటరమణ పాల్గొని సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములును దర్శించుకున్నారు. అనంతరం అకరణ అనుసంధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లాటి. సత్యనారాయణ, సర్పంచి గద్దె ఆనంద్ కుమార్, మూలలంక పిఏసిఎస్ చైర్మన్ నామాని అన్నవరం, ఎంపీటీసీ రావడి బాలు, అల్లూరి రంగరాజు, కృష్ణం, రాజు ఎస్‌బి రాజు, గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించండి

విశాలాంధ్ర-పాలకోడేరు : తనను స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కలవపూడి శివ ఓటర్లను అభ్యర్థించారు. పాలకోడేరు ఉండి మాజీఎమ్మెల్యే, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు(కలువ పూడి శివ) ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా పాలకోడేరు మండలం లో విస్సా కోడేరు, మొగల్లు, వేంద్ర గ్రామాలలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఉండి నియోజకవర్గంలో తాను శాసనసభ్యులుగా ఉన్న కాలంలో ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. తన హయాంలో నియోజకవర్గం సర్వతో ముఖాభివృద్ధి చెందిందన్నారు. 20 సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పని చేశానని,మరలా ఉండి నియోజకవర్గ నుంచి పోటీ చేస్తానని టిడిపి అధిష్టానానికి తెలిపిన పట్టించుకోలేదని వాపోయారు. నన్ను సంప్రదించకుండా ఉండి నియోజకవర్గం సీటు రామరాజుకు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉండి ప్రజల నిర్ణయం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. మరొకసారి ఉండి నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించాలని అభ్యర్థించారు.

బీసీలు ఇప్పుడే గుర్తుకు వచ్చారా?

విశాలాంధ్ర-చాట్రాయి: ఎవరి మాటల వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉంటాయో తెలుసుకునేంతవరకు ప్రజలు మోసపోతూనే ఉంటారని లెనిన్ మహాశయుడు అన్న మాటలు ఖచ్చితంగా గుర్తుకు వచ్చేలా చేస్తున్నారు పాలకవర్గ పార్టీల పెద్దలు. గడచిన రెండు దఫాల నుండి నూజివీడు నియోజకవర్గంలో బీసీ సామాజిక తరగతి పేరుతో పోటీ చేస్తూ ఓడిపోతూ వస్తున్న మాజీ శాసనసభ్యులు, తెదేపా నూజివీడు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు పార్టీలో మూడోసారి సీటు రాకుండా చేజారిపోయేసరికి హుటా హుటిన వైసిపి రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి వైవి సుబ్బారెడ్డితో చర్చలు జరిపి వచ్చారని సోషల్ మీడియా కోడై కూసింది . వైసీపీలో ప్రముఖ స్థానంలో ఉన్న నూజివీడు ప్రస్తుత శాసనసభ్యులు ప్రతాప అప్పారావును కాదని ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకే సీటు వస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందనేది జగమెరిగిన సత్యం. ఈ ఎపిసోడ్ లో వైసీపీ శ్రేణులు ముద్దరబోయినకు అన్యాయం జరిగిందని 10 ఏళ్ళ పాటు వాడుకొని వదిలేశారని నూజివీడు నియోజకవర్గంలో వైసీపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తుందని ప్రతీ నోటా వినపడే మాటని పలువురు అంటున్నారు. తీరా వైసిపి జాబితాలో సహజం గానే ప్రతాప్ అప్పారావు పేరు వైసిపి అధిష్టానం ప్రకటించింది. దీంతో ముద్దర బోయిన రెంటికీ చెడ్డ రేవడి అయ్యారని పలువురు అంటున్నారు. తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు ముద్దర బోయిన ఓడిపోయినప్పటికీ ఇన్చార్జిగా ఉన్న ముద్దరబోయిన గెలిచిన ఎమ్మెల్యే కంటే వందలరెట్లు అధికారాన్ని అనుభవించారని, అవకాశం ఇచ్చింది చంద్రబాబు కాదా అని పలువురు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో నుండి ఎన్నికల ముందు తెలుగుదేశం లోకి వచ్చి నామినేషన్ వేసిన ముద్దరబోయినకు స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులు ఓట్లు వేయకపోతే అన్ని వేల ఓట్లు ఎలా వచ్చా యని పలువురు అంటున్నారు. చంద్రబాబు ముద్దర బోయినకు గౌరవం ఇచ్చి ఉండకపోతే జన్మభూమి గ్రామ సభలలో అధికారాన్ని ఎలా చలాయించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెండవసారి అవకాశం ఇచ్చిన తర్వాత కూడా పార్టీలో ముఠాల నివారణకు చేసింది ఏముందని పలువురు అంటున్నారు. 25 మంది సభ్యులతో ఉన్న సమన్వయ కమిటీని ఎందుకు సమన్వయ పరచలేకపోయారో ఆలోచించాలని పలువురు అంటున్నారు.

చాట్రాయి మండలంలో ఉన్న జనాభాలో అత్యధిక శాతం దళితులు దళిత నాయకత్వం అభివృద్ధి చేయడానికి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు చేసింది చెప్పుకోవడానికి ఏమైనా ఉందా...? చాట్రాయి మండలంలో 18 పంచాయతీలు ఉంటే తెలుగు దేశం పార్టీ గెలిచింది కేవలం రెండు. మర్లపాలెంలో దళిత సర్పంచి టిడిపి తరపున గెలిచారు. దళిత సర్పంచ్ ఇంటికి వెళ్లి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఈనాటికి ఎప్పుడైనా అభినందించారా. మండల జనాభా 60 వేలకు పైగా ఉంటే 20శాతం వరకు దళిత జనాభా ఉంది. వాళ్ళకోసం చేసింది ఏమైనా ఉందా...? కేవలం ముగ్గురు నలుగురు పెత్తందార్లను నమ్ముకుని వాళ్లకే మూడు, నాలుగు పదవులు ఇచ్చి అత్యధిక శాతంగా ఉన్నటువంటి దళితుల్ని ,బలహీనవర్గాలని వదిలేసి ఈరోజు సీటు రాకపోయేసరికి బలహీన వర్గాల నివాస ప్రాంతాల్లోకి వెళ్లి తనను మోసం చేశారని దగా చేశారని పదేళ్లు వాడుకున్నారని చెప్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం బీసీ కులాలు ఎన్ని? నూజివీడు నియోజకవర్గంలో ఎన్ని ఉన్నాయి? ముద్దర బోయిన ఇప్పుడు ఎన్ని కులాల దగ్గరికి వెళుతున్నారు . వీరి రాజకీయ చెలగాటంలో గ్రామస్థాయి తెలుగుదేశం పార్టీ శ్రేణులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని పలువురు అంటున్నారు. పార్టీ ముద్దబోయినకు అన్ని పెత్తనాలను కట్టబెడితే నేడు తనకు అన్యాయం జరిగిందని విచిత్రమైన ప్రచారం చేయడం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

దంత సమస్యల పై అవగాహన

విశాలాంధ్ర - అనపర్తి : నోటి శుభ్రతతో చిగుళ్ల వ్యాధి, నోటి దుర్వాసన వంటి సాధారణ దంత సమస్యలను నివారించవచ్చని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి అన్నారు. బుధవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అవ గాహన ర్యాలీ, క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంతవైద్య నిపు ణులు డాక్టర్ భాగ్యలక్ష్మి, ఇతర వైద్యులు వర్మ, కోటేశ్వరి, సునీల్, తరుణ్, డేవిడ్, వాణి, చారి, శిరీష, సరోజిని, జిబిఆర్ నర్సింగ్‌విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి మద్దిపాటి పాదయాత్ర

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మల్ గిరి మేరీ మాత ఆలయం వద్ద నుండి బుధవారం నాడు తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఆధ్వర్యంలో గోపాలపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం నిర్మలగిరి మేరీమాత ఆలయం వద్ద వెంకటరాజు నిర్మలగిరి మేరీమాత స్వరూపం వద్ద ప్రార్థననిర్వహించారు ఈ సందర్భంగా నిర్మలగిరి క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించి వెంకటరాజ ను ఆశీర్వదించారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ జనసేన టిడిపి బిజెపి పార్టీల సహకారంతో తాను గోపాలపురం నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు రాష్ట్రానికి సుపరిపాలన అందించాలని ధ్యేయంతో తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బిజెపి జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు అన్నారు రాష్ట్రంలో సంవత్సరాలనుండి అరాచక పాలన కొనసాగుతోందని దీనిని అంతముందించేందుకు జనసేన బిజెపి టిడిపి నాయకులు కార్యకర్తలు సమిష్టి కృషితో వైసీపీని ఓడించాలని అన్నారు రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకొండ ఉండటానికి తెలుగుదేశం బిజెపి జనసేన పొత్తు పెట్టుకున్నయని అన్నారు అన్ని పార్టీలు సంఘటితంగా వైసీపీని ఎదుర్కొని రాష్ట్రంలో మంచి పాలన అందించేందుకు తనను గెలిపించాలని కోరారు అంతకుముందు కనకదుర్గమ్మ ఆలయం వరసిద్ధి వినాయక ఆల యం వద్దప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మలగిరి మేరీ మాత ఆలయం వద్ద నుండి పాదయాత్ర ప్రారంభించారు గౌరీపట్నం నుండి దుద్దుకూరు పాదయాత్ర చేరుకోగానే గ్రామం వద్ద తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు దుద్దుకూరు మహిళలు హారతులతో స్వాగతం పలికారు ఈ పాదయాత్రలో దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ నాగరాజు టిడిపి నాయకులు గన్నమని హరికృష్ణ పెనుమత్స సుబ్బరాజు ఆంధ్ర బుల్లి రాజు ఆంద్రూ వెంకటేశ్వరరావు ఆంద్రు సత్తిరాజు కొటారు ధ్రువకాంత్ పాతూరు గిరిధర్ దాపర్తి వీర కృష్ణ ముళ్ళపూడి దొరాజి చౌదరి షేక్ మీరా సాహెబ్ జమ్ముల సతీష్ పాకలపాటి గాంధీ కంటిపూడి సుబ్బారావు ఉప్పులూరి రామారావు బల్లా సూర్య చక్రం కూచిపూడి చక్రవర్తి కాకర్ల రామ తులసి రాజేశ్వరి సాంబ సూర్యచంద్రం ముళ్ళపూడి సత్యనా రాయణ జనసేన నాయకులు సంభా శ్రీనివాస్ పాపోలు ప్రదీప్ సలాది వేణు మాధవి బిజెపి నాయకులు కాట్రగడ్డ రవీంద్ర కుండేపాటి రత్నాజీ చౌదరి సిఎస్ సత్యనారాయణ తోపాటు గోపాలపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, గోపాలపురం మండలం మహిళా నేత ఆలపాటి గంగాభవాని గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిననాయకులు, కార్యకర్తలు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

వాలంటీర్లతో భరత్‌రామ్ చీప్ పాలిటిక్స్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తనపై ఎలాగైనా విజయం సాధించాలని పగటి కలలు కంటున్న మాజీ ఎంపీ, గంజాయి డాన్ మార్గాని భరత్ రామ్ వాలంటీర్లతో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాడని రాజ మహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ బీజేపీ జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించి వారిని ప్రలోభాలకు గురి చేస్తున్న చిత్రాలను ఆధారాలతో పాటు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని వివరించారు. ఈ మేరకు ఆయన టీడీపీ నాయకులతో కలిసి దేవీచౌక్ సెంటర్లో మీడియాతో మాట్లాడుతూ అసలు రాజమండ్రిలో గత 2 రోజులుగా ఏం జరుగుతోందని ప్రశ్నించారు. అధికారులకు విషయం తెలియదా..? లేదా తెలిసి కూడా, ఎన్నికల నోటిఫి కేషన్ వచ్చాక కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా..? అని ప్రశ్నించారు. భరత్ రామ్ రాజమండ్రి నగరంలోని వార్డు వలంటీర్లతో ఒక్కొక్కరితో సమావేశం నిర్వహిస్తూ వాళ్లకు లేనిపోని ఆశలు కల్పించి.. వలంటీర్ పదవికి రాజీనామా చేసి, వచ్చే ఎన్నికల్లో తన తరపున బూత్ ఏజెంట్లుగా పని చేయాలని, అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల పట్టాలు ఇప్పిస్తా, ఎకనామికల్ గా ఆదుకుంటానంటూ అరచేతిలో స్వర్గం చూపిస్తూ హామీ ఇస్తున్నాడని ఆరోపించారు. మాట్లాడితే... నా అక్క చెల్లెమ్మలు అని చెప్పే ఎంపీ... వలంటీర్ల జీవితాలతో ఆటలాడుకోవడం, రాజీనామా చేయా లనడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. వచ్చే 50 రోజు లో వైసీపీ ప్రభుత్వం కుప్పకూలుతుందని, మరి ఏ విధంగా వారిని ఆదుకుం టావ్ భరత్ రామ్ అని నిలదీశారు ఆదిరెడ్డి శ్రీనివాస్. తన స్వార్థం కోసం వారి జీవితాలతో ఆటలాడుకోవడం సరైన విధానం కాదన్నారు. అధికారంలోకి వస్తే.. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామన్నారు. వారందరికీ మెరుగైన వేత నం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు. భరత్ చేస్తున్న చీకటి రాజకీయాలు, వాలంటీర్లతో పెట్టిన సమావేశాలను ఆధారా లతో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని,వలంటీర్ల తో రహస్య మీటింగ్ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోక పోవడంపై ఎలక్షన్ కమీషన్కు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వానికి హైకోర్టు, ఎలక్షన్ కమిషన్ ఉత్వర్వులు పట్టవా..? అని ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. రాబోయేది తెలుగుదేశం,బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వమ న్నారు.దక్షిణ కాశీగా పిలువ బడే రాజమహేంద్రవరం నగరం ఎన్నో ప్రాచీన చరిత్రలకు నిలయమన్నారు. ఎందరో మహానుభావులు జన్మించిన పుణ్య స్థల మన్నారు. అటువంటి కల్చర్ హబ్‌ను మార్గాని భరత్ రామ్ క్రైమ్ హబ్‌గా మార్చేశాడని ఆరోపించారు. సమావేశంలో నగర కమిటీ ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, కార్య నిర్వాహక కార్యదర్శి పార్వతి సుందరి, కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో బుధవారం జరిగిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లీష్ సబ్జెక్టులో ఐదు సెంటర్లలో 963 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 916 మంది విద్యార్థులు పరీక్ష రాశారు . దీనిలో రెగ్యులర్ 933మందికి,910 మంది రాశారు. గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 30 మంది కి 6గురు విద్యార్థులు మాత్రమే పరీక్ష రాశారు. మొత్తం 963 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 916 మంది విద్యార్థులు రాశారని 95.12శాతం అని, రెగ్యులర్ విద్యార్థులు 97.53 శాతం, సప్లిమెంటరీ విద్యార్థులు 20శాతం హాజరైయారని విద్యాశాఖ అధికారులు మాణిక్యం తిరుమల దాసు, అప్పారావు తెలిపారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కేనని అక్కడ నుండి ప్రజాస్వామ్య విజయం ప్రారంభమవుతుందని స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగ మోహన్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నూతన ఓటర్ అవగాహన కార్యక్రమం డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ కె ఫణీంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శతాబ్ది డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజరికం నియంతృత్వ విధానాలు వైఫ ల్యం చెంది ప్రజాస్వామ్యం ఏర్పడిందన్నారు. అలాంటి ప్రజాస్వామ్యానికి పునాది ఓటర్లే అన్నారు. రాష్ట్ర, కేంద్రాలలో ఉన్న చట్టసభలకు ఓటర్లు ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటారన్నారు. నిస్వార్థ నిజాయితీ నీతిమంతులైన నాయకులను ప్రజా ప్రతినిధులుగా మనం ఓటు ద్వారా ఎన్ను కోవాలన్నారు. అప్పుడు ఓ పుచ్చలపల్లి సుందరయ్య, లాల్ బహదూర్ శాస్త్రి, జై ప్రకాష్ నారా యణ వంటి నీతిమంతులైన ప్రజా ప్రతినిధులు ఎన్నికై అటు శాసనసభలు ఇటు పార్లమెంటులో ఉత్తమ సంస్కరణలు వచ్చి ప్రపంచ ప్రజాస్వామ్యానికి మన దేశం మణిహారంగా నిలబడుతుందన్నారు. నూతన ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి రెడ్డి సత్యనారాయణ, సీనియర్ అధ్యాపకులు గన్నవరపు శ్రీనివాస్, మెర్ల సుధ, వివివిఎస్ సుబ్బారావు, ఆఫీస్ ఇన్చార్జిలు శీలం ప్రశాంత్ కుమార్, అల్లాడి సాయి భాస్కర్, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లు టి సతీష్, బి మణికంఠ, ఏ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అకాలం వర్షం ... ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర - పెరవలి : అకాలంగా కురిసిన వర్షానికి మండలంలో గల పలు ప్రాంతాలలో సీసీ రోడ్లు నీట మునిగాయి. ఆకారణంగా ఆప్రాంతాలలోని వారు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడక తప్పలేదు. ముక్కామల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు నిలిచిపోవడం వలన విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు గ్రహించి గ్రామాలలో, పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి, తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి పాటుపడతా : దుర్గేష్

విశాలాంధ్ర - పెరవలి : మండలంలోని కానూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను, అభిమానులను బుధవారం నిడదవోలు నియోజక వర్గం తెలుగుదేశం,జనసేన, భారతీయ జనతా పార్టీల ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ నిడదవోలు నియోజక వర్గం టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావుని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడిగా కలిసి మూడు పార్టీల నాయకులు గ్రామంలో సమన్వయం చేసుకుని దుర్గేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శేషారావు కోరారు.ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గం అభివృద్ధి కొరకు తాను పనిచేస్తానని ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.ఈకార్యక్రమంలో పలువురు టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - రాజానగరం : పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత అని ఎపి స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ జి.క్రిష్ణ ప్రియ అన్నారు. మండలంలోని దివాన్ చెరువు పరిధిలోని ఫారెస్ట్ అకాడమీ నందు అటవీ శాఖ ఆధ్వర్యంలో బుదవారం జరిగిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆవాసాల సంఖ్య తగ్గిపోవడం,కాలుష్యం,పర్యావరణ విధ్వంసం వంటి కారణాలతో పిచ్చుకల సంఖ్య తగ్గిపోతున్నదని అవేదన వ్యక్తం చేశారు. పిచ్చుకల ఆవాసాలను సంరక్షించడానికి,వాటి మనుగడకు భరోసా ఇవ్వడానికి సమాజం సమష్టి బాధ్యత స్వీకరించాలని, తగు చర్యలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా 20వ తేదీన ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు చేపట్టారన్నారు. పిచ్చుకల ప్రాముఖ్యత, వాటి పర్యావరణ సహకారం మరియు వాటి సంఖ్య తగ్గిపోవడానికి గల కారణాలను వివరించారు. అదేవిధంగా తూర్పు కనుమల వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో పాములపై అపోహలను తొలగించే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.దీనిలో బాగంగా ట్రైనీలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అకాడమీ అధికారులు, ఎఫ్బివోలు తదితరులు పాల్గొన్నారు.

నటభూషణ్ శోభన్‌బాబు వర్ధంతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : నటభూషణ్ శోభన్‌బాబు 16వవర్ధంతిని పురస్కరిం చుకుని శోభన్‌బాబు సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం గోదావరి బండ్ రోడ్ లో ఆయన విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సేవా సమితి గౌరవ అధ్యక్షులు అల్లు బాబీ మాట్లాడుతూ నేటికీ అభిమానులు ఇంతటి అభిమానం చూపుతున్నారంటే ఆయన తెలుగు సినిమా ఉన్నంతకాలం తెలుగు ప్రజల హృదయాలలో తమ విలక్షణమైన నటనతో సుస్థిరమయిన స్థానం సంపాదించుకున్నందుకేనని అన్నారు, ఈ కార్యక్రమంలో సలహాదారులు బళ్ళా శ్రీనివాసరావు, సేవా సమితి అధ్యక్షుడు కొనకళ్ల శ్రీనివాస్ కుమార్,కార్యదర్శి పూడి శ్రీనివాస్, కే ఆనంద్,ఎస్ఎన్ రావు,,సోగ్గాడు ప్రసాద్, బట్టిప్రోలు శ్రీనివాస్(భీమవరం), ఏ అన్నవరం,ఆర్వీబీఎస్ శర్మ,దేబిరుకుల రమేష్, కె ప్రసాద్, వీబీ శంకర కుమార్, పీ శివ కేశవ శర్మ, ఎమ్ ప్రకాష్, డి శేషు,జి సింహాచలం, కేఎస్ ప్రకాశరావు,వి న్యుటన్ బాబు, టి వెంకటేష్, ఎమ్ సూర్యనారాయణ, శీలం అప్పారావు, సత్యనారాయణ, స్వాతిప్రకాష్, శోభన్‌బాబు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కేసీబీఎస్‌తో మెరుగైన సేవలు

విశాలాంధ్ర - కాకినాడ : ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేం దుకు కృషి చేస్తామని ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డిం గ్ సొసైటీ (కే సి బి ఎస్) అధ్య క్షుడు కోసూరి శ్రీనివాస సత్య నారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక సూర్య కళామందిరం ఆవరణలోని కె.వి.ఆర్.కె ఆడిటోరియంలో బుధవారం కేసీబీఎస్ సమావేశం జరిగింది. సమావేశాన్ని అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తితో పాటు డైరెక్టర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేనేజర్ చీమలకొండ గంగా ధరం అతిథులను వేదికపైకి ఆహ్వానించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆడిటర్ పి. సుబ్రహ్మణ్యం సభ్యుల ఇన్ కమ్ టాక్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోసూరి మాట్లాడుతూ సభ్యుల ఆదరాభిమానాలతో ఇటీవలే శతాబ్ది ఉత్సవాలను జరుపు కున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కేసీబీఎస్ ప్రధాన లక్ష్యమన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లా డుతూ కే సి బి ఎస్ లో పనిచేసే ప్రతి ఉద్యోగి మరింత అంకితభావంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో కే సి బి ఎస్ ప్రధాన కార్యదర్శి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీ ప్రసాద్ లావణ్య, ముత్తా మధు సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలుపించుకోవాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జరగనున్న ఎన్నికల్లో టీడీపీ - బీజేపీ - జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయా పార్టీల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక మెయిన్ రోడ్డులోని హెూటల్ జగదీశ్వరిలో టీడీపీ - బీజేపీ - జనసేన పార్టీల కూటమి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ - బీజేపీ -జనసేన పార్టీల కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు, టిఎన్‌టియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు, జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, బీజేపీ నాయకులు బొమ్ముల దత్తు తదితరులు పలు అంశాలపై చర్చించారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో నగర టీడీపీ అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకీ రామయ్య, జనసేన పార్టీ నాయకులు విజయ్, బీజేపీ నాయకులు కురగంటి సతీష్, రేలంగి శ్రీదేవి, కొల్లివెలసి హారిక అధిక సంఖ్యలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి మహోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో వెలిసినటువంటి శ్రీదేవి భూదేవి సమేత (జియన్న) శ్రీ వెంకటేశ్వర స్వామి తీర్థ మహోత్సవం బుధవారం నుండి ఘనంగా ప్రారంభమైంది. ఈ తీర్థ మహోత్సవం మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని, ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ నిర్వహణ ఈవో ఉండమట్ల సురేష్ తెలిపారు. స్వామి వారిని దర్శించుకోవడానికి గండేపల్లి మండలం నుండే కాకుండా, చుట్టు ప్రక్కల మండలాల నుండి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఒక్కసారిగా ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. గండేపల్లి పోలీసు వారు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలు గలేదు. జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో, గండేపల్లి ఎస్సై నౌడు రామకృష్ణ ఆధ్వర్యంలో, నలుగురు ఎస్ఐలతో పాటు, 40 మంది పోలీస్ సిబ్బందితో ఎవరికీ, ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అంతరిక్ష పరిశోధనలో అన్నదమ్ముల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణానికి చెందిన అన్నదమ్ములు ఎస్.సాయి సందీప్, ఎస్.సాయి ప్రదీప్ లు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ గవర్న మెంట్ ఆఫ్ ఇండియా ప్రారంభించిన రిజిస్టర్డ్ స్పేస్ ట్యూటర్ ప్రోగ్రామ్ అనే ప్రత్యేక కార్యక్రమానికి వీరిరువురూ ఎంపికయ్యారు. ఈ అన్నదమ్ములు ఏలేశ్వరంలో స్పార్క్ ఫౌండేషన్ అనే సాంకేతిక అంతరిక్ష విజ్ఞాన సంస్థను స్థాపించి ఒక్క ఏలేశ్వరం పట్టణమే కాకుండా రాష్ట్రంలో పలు చోట్ల విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్రో అంతరిక్ష విద్య భాగ్యస్వాములుగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మొట్టమొదటి శాస్త్రీయ సాంకేతిక అంతరిక్ష సంస్థగా స్పార్క్ ఎంపికయిందని, అంతరిక్ష మరియు సాంకేతిక విద్య కోసం కృషి చేస్తున్న ఏకైక సంస్థగా ఇప్పటికే చాలా రికార్డులు సాధించామని, అంతరిక్ష విజ్ఞాన రంగంలో విద్యార్థులను ప్రేరేపించగల మరియు మార్గదర్శకత్వం చేయగల అంతరిక్ష విద్యావేత్తల సమూహాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్పార్క్ సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ కోఆర్డినేటర్స్ రవి, దీపిక, నవనీత్, స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కాజులూరు : గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిదిలో గల కాజులూరు, కరప, తాళ్ళరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శు క్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపి ఈపిడిసిఎల్ కాకినాడ డిఈ జి ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ ఎం సూర్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరామత్తు పనులు, ట్రీ కటింగ్ పనుల్లో బాగంగా మద్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గొల్లపాలెం ఎస్ఎస్ హెచ్చు ఫీడర్ పరిదిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మెగలిపాలెం, శలపాక, తణుకువాడ, మంజేరు, శీల, శీలలంక, ఒంటితాడి కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, తాళ్ళరేవు మండలం బొడ్డువానిలంక. కరప మం డలం గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుం దన్నారు. విద్యుత్తన్లలోని గృహవాసాలతోపాటు ఇండ్రస్టీయల్ ఫీడర్. ఆక్వా చెరు వులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

కూలింగ్ వాటర్ మిషన్లు ఆందజేత

విశాలాంధ్ర - పెద్దాపురం : కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండల కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి దాత గుణ్ణం చంద్రమౌళి బుధవారం రెండు కూలింగ్ వాటర్ మిషన్లు అందజేసినట్లు ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ తెలిపారు త్వరలో జరుగనున్న అమ్మవారి జాతర దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఈ మిషన్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని, భక్తులు అవసరాన్ని తీర్చిన దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ విజయం తథ్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : మంచి మనసుతో రాష్ట్రంలో సుపరిపాలన సాగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డికి ఎల్లప్పుడూ దేవుని ఆశీస్సు లుంటాయని, కనకదుర్గ ఆశీస్సు లతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలోని నూతన కనకదర్గ ఆలయంలో బుధవారం సాయంత్రం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నదానం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్, దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. పార్టీ రహితంగా అర్హులందరికి నవరత్నాలు పథకాల ద్వారా సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాని దక్కుంతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మి నారాయణ, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మండల కన్వీనర్ గోపు మురళి, ఎలిశెట్టి నరేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

విశాలాంధ్ర - గండేపల్లి : వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత 20 రోజుల నుండి భానుడు భగ భగా మండిపోతున్నాడు. మధ్యాహ్న సమయంలో, ప్రజలు బయటకు రావాలంటే ఎండ తీవ్రతకు బయటకు రాని పరిస్థితి. అటువంటి తరుణంలో వరుణుడు కరుణించాడు. బుధవారం సాయంత్రం సమయంలో అకాల వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. సుమారు గంట పాటు కురిసిన ఈ వర్షానికి రోడ్లన్నీ, వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ వర్షం కొంత మందికి ఆనందం కలిగించినా, రైతులకు ఆందోళన కలిగిస్తుంది.

విశాలాంధ్ర - ముమ్మిడివరం : వాతావరణ పరిస్థితులలో ఆకస్మికంగా ఏర్పడిన మార్పులు కారణంగా మండలంలోని పలు ప్రాంతాలు నీటములుగాయి సాయంత్రం నుంచి వర్షం కురవడంతో భారీ ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలందరూ ఒక్కసారిగా వర్షం కురవడంతో చల్లగాలులు మధ్య సేద తీరారు. వర్షం కారణంగా రోజువారి పనులు చేసుకునే కూలీలు, రైతులు ఇబ్బంది పడ్డారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

విశాలాంధ్ర - పిఠాపురం : తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని పిఠాపురం మాజీ శాసనసభ్యులు ఎస్వీ.ఎస్. ఎన్. వర్మ సవాలు విసిరారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ వైసీపీ నాయకులు ఎంపీ,ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని పేర్కొ న్నారు. ఈ ప్రభుత్వంరైతు పంట పండించుకోవడానికి నీళ్ళు ఇవ్వలేకపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అదేసాల మేరకు పొత్తు లో భాగంగా పవన్ కళ్యాణ్ గెలుపు కు కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ బరి లో నిలవక పోతే తాను పోటీ చేస్తానని వర్మ తెలిపారు. ఈ కార్యక్రమం లో నల్లా శ్రీను,గంగాధర్, అప్పారావు,మాణిక్యం పాలుగున్నారు.

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - అమలాపురం : లైఫ్ ఇస్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధ వారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. వేసవి కాలం బ్లడ్ దొరకక ఎక్కుమంది ఇబ్బం ది పడుతున్నారు. డోనార్స్ కూడా ముందుకు రావడం లేదు .అందుచే రోజుకి కోనసీమ లో 25-30 పాకెట్స్ అవసరం అవ్వగా కేవలం 5-10 పాకెట్స్ మాత్రమే అందుబాటులో ఉన్నందున లైఫ్ ఈజ్ బీటిఫుల్ ఫౌండర్ %ఽ% ప్రెసిడెంట్ కొలిశెట్టి తాతాజీ మిత్రబృందం ఈ రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు.ఈ బ్లడ్ డొనేషన్ క్యాంప్ లో సుమారుగా 42 పాకెట్స్ వరకు రక్తదాతలు రక్తదానం చేశారు. ముఖ్యంగా మహిళలు కూడా మొదటి సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ఈజ్ బ్యూటీ ఫుల్ ఫౌండర్ ప్రెసిడెంట్ కొలిశెట్టి తాతాజీ సతీమణి వీర లక్ష్మి దుర్గ ఫౌండ ేషన్ టీమ్ చీకట్ల కిరణ్ , అర్ కె నాయుడు ఆకుల , వానపల్లి కేశవ , హను మాన్ బుజ్జి , కుంపట్ల వరలక్ష్మి, శ్రీరామ్, కోనసీమ కేర్ హాస్పిటల్ డా.కారెం రవితేజ అడ్డాల గోపాల కృష్ణ సాయి రవీంద్ర హాస్పిటల్ డాక్టర్ పివి ఎల్ రవీంద్ర ఏ ఎస్ ఏ హాస్పిటల్ డాక్టర్ పి శివ ఆశిష్ పండు డిఎస్ ఎన్ కుమార్ ,డాక్టర్. నాగ మానస, గొలకోటి చిన్నా , నిమ్మకాయల రాజేష్ , గొకరకొండ భాస్కర్ , హుస్సేన్ , పోతంశెట్టి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాల భ్రష్టు పట్టించిన వైసీపీ నాయకులకు వచ్చే ఎన్ని కలలో ఓట్లు అడిగే హక్కు లేదని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ ఎన్ వర్మ అన్నారు. గొల్లప్రోలు శివారు తాటిపర్తి రోడ్లో గల గెస్ట్ హౌస్ నందు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పంటలకు సాగునీరు అందించలేని దుస్థితిలో స్థానిక ప్రజాప్రతి నిధులు ఉన్నారని విమర్శించారు. టిడిపి హాయంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించామని తెలిపారు. 1800 కోట్ల రూపాయలతో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన పురుషోత్తమ పట్నం పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టిందని, పిఠాపురంకు సరఫరా కావలసిన 3 టీఎంసీల నీరు ఏలేరు రిజర్వాయర్ నుండి తాండవకు తరలిపోతున్నా ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు చోద్యం చూస్తు న్నారని ఆరోపించారు. ఏలేరు ఆధునీకరణ ఫేజ్ -2 పనులను నిలిపివేసింది ఎంపీ, ఎమ్మెల్యే లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల కాలం నుండి పిఠాపురం నియోజకవర్గానికి ఎటువంటి నిధులు మంజూరు చేయని ఎంపీ గీత ఇప్పుడు పిఠాపురం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నందువల్ల ఇటీవల అరకొరగా నిధులు విదిలించారన్నారు. తమ నాయకుడు చంద్రబాబు ఆదేశాల మేరకు పవన్ కళ్యాణ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామన్నారు. పవన్ స్థానంలో జనసేన తరపున వేరే ఎవరైనా పోటీ చేస్తే తాము సహకరించేది లేదని టిడిపి అభ్యర్థిగా తాను పోటీలో ఉంటానని వర్మ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగర పంచాయతీ చైర్ పర్సన్ శీరం మాణిక్యం, జడ్పీటీసీలు మడికి సన్యాసిరావు, బర్ల అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధికారంతో రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉం టుందని తెదేపా కాకినాడ సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నందు బుధవారం కొండబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ శ్రేణులతో తెలుగుదేశం పార్టీ కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అవినీతి, అరాచక, డ్రగ్స్, గంజాయి, రౌడీ గుండాల పాలన నుండి మన కాకినాడను మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత నేడు కాకినాడ నగర ప్రజలకు ఎంతైనా ఉందని, అక్రమ సంపాదన కోసం కాకినాడ నగరాన్ని గంజాయి నగరంగా మార్చి యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని,అన్నారు. యువత భవిష్యత్తు, నవ్యాంధ్ర పురోగతికి తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడం చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఆవశ్యమని, రాబోయే తెలుగుదేశం జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం లో చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటింటికెళ్లి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవశ్యకతను, తెలుగుదేశం కూటమి అందించు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రతీ ఓటరుకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, తాజుద్దీన్, సీకోటి అప్పలకొండ, ఖాన్, రహీమ్, గాది శివ, %వీణ% అన్సర్, గుజ్జు దుర్గ లక్ష్మణరావు, బంగారు సూర్యావతి సత్యనారాయణ, చొల్లంగి వీరబాబు, అంబటి చిన్న, మల్లాడి చిన్న, చింతలపూడి రవి, మీసాల సునీత, మల్లాడి గంగాధర%శీ%, అంగాడి దుర్గ, కొల్లు కుమారి, దేవు జయలక్ష్మి, రిక్కా లక్ష్మి, మూగు చిన్ని, నల్లారి తులసి, వడిసల దాలమ్మా, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం సీటుపై టీడీపీలో టెన్షన్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం నియోజకవర్గం వైసీపీ పార్టీ అభ్యర్థిగా మంత్రి పినిపే విశ్వరూప్ పేరుని అధిష్టానం ప్రకటించినప్ప టికీ.ఆయనకు ప్రత్యర్థి అభ్యర్థిగా ఎవరు ఎన్నికలలో నిలుస్తారో అన్నదానిపై తెలుగుదేశం లేదా జనసేన అభ్యర్థి అన్న క్లారిటీ ఇవ్వకపోవడంతో అమలా పురం నియోజకవర్గ తెలుగుదేశం జనసేన ఆశావహులు రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు టెన్షన్ కు గురవుతున్నారు. మంత్రి పినిపే విశ్వరూప్ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం నియోజకవర్గంలో ప్రచారం మొదలు పెట్టడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. అయినప్పటికీ అమలాపురం స్థానాన్ని తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తారా.జనసేన పార్టీకి కేటాయిస్తారు అన్నదానిపై నేటివరకూ స్పష్టంగా తేలలేదు. తెలుగుదేశం అభ్యర్థిగా అయితా బత్తుల ఆనందరావుకి కేటాయించారని ఆయన అభిమానులు చెబుతున్నారు.జనసేన పార్టీ అభ్యర్థిగా డిఎంఆర్ శేఖర్ అంటూ కొంతమంది ప్రచారానికి తెరదీశారు. మరికొందరు పాము సత్య శ్రీ తెలుగుదేశం పార్టీ టికెట్ నుండి పోటీ చేస్తారని కూడా ప్రచారం సాగుతుంది. పార్టీ నాయకులు ఎవరో తెలియని దిగుమతి నాయకులను తెచ్చి తమపై పెట్టడంపై పార్టీ కార్యకర్తలు కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గడిచిన ఎన్నికల్లో ఓటమి చెందిన అయితాబత్తుల ఆనందరావు గడిచిన ఐదేళ్లు అధికార పార్టీపై నిత్యం విమర్శలు వర్షం కురిపించి పార్టీకోసం పోరాటం చేశారు కానీ చివరి నిమిషంలో టికెట్ కోసం ఆదిస్తానం వద్ద డెబిరించాల్సిన పరిస్థితి పట్ల కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు అమలాపురం ఎంపీ సీటు ఎవరు ఎమ్మెల్యే ఎవరు ఏ పార్టీ అభ్యర్థి అసెంబ్లీ బరి లో దిగుతారో అన్నదానిపై జనసేన టిడిపి కార్యకర్తల తో పాటు. వీరికి ప్రత్యర్థ పార్టీ అయినా వైసీపీ కార్యకర్తలు మరింతగా ఎదురుచూస్తున్నారు. దివంగత లోక్ సభాపతి జి ఎం సి బాలయోగి తనయుడు గంటి హరీష్ మాధుర్ ని అసెంబ్లీ కి పోటీకి నిలబెడతారా అమలాపురం పార్లమెంట్ కి నిలబెడతారా అన్నది ఎటూ తేల్చక పోవటంతో బాలయోగి అభిమానులు తీవ్రమైన టెన్షన్లకి గురవుతున్నారు లోకసభ స్పీకర్ గా ఉన్న కాలంలో ఉభయ గోదావరీ విశాఖలో దేశం అభ్యర్థుల్ని కనుసైగతో బాలయోగి గెలిపించినట్లు చర్చ జరిగేది అలాంటి బాలయోగి కొడుకు కు సీట్ ఇవ్వటంతో చంద్రబాబు తాత్సారం చేయటాన్ని బాలయోగి అభిమానులు ఆవేదన చెందుతున్నారు .